నేటి నుంచి పాలిసెట్ దరఖాస్తుల స్వీకరణ

రామంతాపూర్: తెలంగాణ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్ – 2025 దరఖాస్తుల స్వీకరణ నేటి నుంచి ఏప్రిల్ 19 వరకు జరగనుంది. మే 13న పరీక్ష జరగనుండగా.. 12 రోజులకు ఫలితాలు ప్రకటిస్తామని రామంతాపూర్ జవహర్‌నగర్ నెహ్రూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ వివరించారు. అప్లికేషన్ ఫీజు, ఎస్సీ, ఎస్టీలకు రూ.250 ఇతరులకు రూ. 500 ఇతర సందేహాలకు 8031404549.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లో నీటి ఎద్దడి నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ అన్నారు. ఓల్డ్ మల్కాజిగిరిలో ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి సహకారంతో నూతన పవర్‌బోర్‌ను ప్రారంభించారు. గాంధీపార్కులోనూ పవర్ బోర్ ఏర్పాటు చేశామని చెప్పారు. పార్కుల అభివృద్ధికి కూడా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సుదర్శన్‌గౌడ్, సుధాకర్, బస్తీవాసులు మణెమ్మ, సువర్ణ, రాధిక, శోభ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ ఫ్లవర్‌లో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్

ఉప్పల్: ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, ఓయూ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం వికసిత్ భారత్ యువ పార్లమెంట్ కార్యక్రమాన్ని లిటిల్ ఫ్లవర్ కళాశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీసీపీ శ్రీనివాసులు, ప్రొఫెసర్ విద్యాసాగర్, ఎన్‌ఎస్‌ఎస్ సెల్ కృష్ణకుమార్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాజకీయ అవగాహన, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత తదితర అంశంపై విద్యార్థులు మాట్లాడారు. 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' అనే అంశంపై రంగారెడ్డి, వికారాబాద్ జిల్లా విద్యార్థులు ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ జయంతిరెడ్డి, డైరెక్టర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో కార్పొరేటర్ శాంతి, జలమండలి అధికారులు

అల్వాల్: అల్వాల్ డివిజన్ వాసవి ఎన్‌క్లేవ్‌లో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, జలమండలి మేనేజర్ కృష్ణమాచారి, అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో మురుగునీరు ప్రవహిస్తుందని కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో కాలనీలో అధికారులు తనిఖీ చేశారు. కాలనీలోని మురుగునీటి లైన్లను ప్రధాన లైన్‌కు అనుసంధానించామని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని జలమండలి మేనేజర్ తెలిపారు. శేఖర్, అరుణ్, ప్రేమ్, సాజిద్ పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

మేడ్చల్‌రూరల్: విద్యుదాఘాతంతో ఓ కార్మికుడికి గాయాలైన ఘటనలో మేడ్చల్ పోలీసులు విద్యుత్ అధికారులతో పాటు కార్మికులపై కేసు నమోదు చేశారు. భద్రాది కొత్తగూడెం జిల్లాకు చెందిన గుగులోతు రమేష్(25) నగరంలోని నల్లకుంటలో నివాసం ఉంటూ రవిశంకర్‌రెడ్డి అనే విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. కాగా సోమవారం సాయంత్రం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి కిష్టాపూర్‌లో విద్యుత్‌లైన్ పనులు చేస్తుండగా.. ప్రమాదానికి గురై స్తంభంపై నుండి కిందపడి గాయపడిన విషయం తెలిసిందే. విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్, సూపర్‌వైజర్ల నిర్లక్ష్యం కారణంగానే తన భర్త విద్యుదాఘాతానికి గురయ్యాడని బాధితుడి భార్య శ్రావణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ట్రాన్స్‌కో ఏడీ, ఏఈ, కాంట్రాక్టర్, ఆపరేటర్, లైన్‌మెన్‌లపై కేసు నమోదు చేశారు. కాగా కిందపడి గాయాలపాలైన కార్మికుడి గురించి ఆరా తీసేందుకు వెళ్లిన లైన్‌మెన్ మాధవరెడ్డిపై కార్మికులు దాడికి పాల్పడటంతో లైన్‌మెన్ సైతం గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విధి నిర్వహణలో ఉన్న తన భర్తను అకారణంగా కార్మికులు స్తంభానికి కట్టేసి దాడి చేశారని లైన్‌మెన్ మాధవరెడ్డి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సూపర్‌వైజర్ చందు, భరత్‌లతో పాటు పలువురు కార్మికులపై కేసు నమోదు చేశారు. దీంతో ఇరు వర్గాలపై కేసులు నమోదయ్యాయి.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

మేడ్చల్: వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మిషన్ భగీరథ డీఈ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి ఘన్‌పూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేసవిలో ప్రజలకు అవసరమైన నీటిని సరఫరా చేయాలని అధికారులను నాయకులు కోరారు. పాతబోరు మోటార్లకు మరమ్మతు చేయించి తిరిగి ప్రారంభించారు. శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, ఇతర అధికారులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



ట్యాంకర్ల వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలు



అత్వెల్లిలో రోడ్డు పక్కనే పారబోసిన చెత్త,చెదారం

ఓ వైపు నీటి కటకట.. మరోవైపు వ్యర్థాలు



అధ్వానంగా స్వచ్ఛ సర్వేక్షణ్ | తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న ప్రజలు

మేడ్చల్: పాలకవర్గం పదవీకాలం ముగిసి రెండు నెలలు కాకముందే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దక్షిణాదిలో అవార్డు పొందిన మేడ్చల్ మున్సిపాలిటీ వ్యర్థాలమయంగా మారుతోంది.

ఇష్టానుసారంగా వ్యర్థాల పారబోత..

ఒకప్పుడు మేడ్చల్ మున్సిపాలిటీ స్వచ్ఛతలో అగ్రస్థానంలో ఉండేది. రెండేళ్ల క్రితం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దక్షిణ భారత స్థాయిలో చిన్న పట్టణాల జాబితాలో అప్పట్లో మేడ్చల్ మున్సిపాలిటీ అగ్రస్థానంలో నిలిచి దేశ స్థాయిలో అవార్డు పొందింది. ప్రస్తుతం అందుకు భిన్నంగా మారింది.

కనీస బాధ్యత పాటించకుండా..

పట్టణంలో ఏ వార్డు చూసినా వ్యర్థాలమయంగా కనబడుతోంది. కొందరు ఇష్టానుసారంగా రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను పారబోస్తున్నారని పలువురు వాపోతున్నారు. దీంతో చాలా వార్డులు వ్యర్థాల మయంగా మారుతున్నాయి.

తైబజార్ వసూళ్లే లక్ష్యంగా..

పట్టణంలో 23 వార్డుల్లోని కాలనీలలో ఏదో ఓ వారం సంత జరుగుతుంది. వారంతపు సంతల్లో వ్యాపారాలు పెట్టుకునే వారి నుంచి తైబజారు రుసుము వసూలు చేస్తున్నారని, స్వచ్ఛతను పట్టించుకోకపోవడంతో ఆ ప్రాంతం వ్యర్థాలతో కంపు కొడుతోంది.

బాధ్యత మరిచి.. భయంతోనే..

గతంలో వార్డుల్లో ఎక్కడ చెత్త కనిపించినా కార్మికులు ఆటోలు, ట్రాక్టర్లు తీసుకొచ్చి వాటిని శుభ్రం చేసేవారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాలు విధించి చెత్త వేయకుండా జాగ్రత్తలు చేపట్టేవారు. తాజాగా ఈ పరిస్థితి కనిపించడం లేదు. పట్టణంలోని 23 వార్డులు ఇదే తరహాలో ఉన్నాయి.

దిగజారుతున్న ప్రతిష్ట..

రోడ్లు, బహిరంగ ప్రదేశాలు, చెరువు కట్టలపై చెత్త దర్శనమిస్తూ.. మేడ్చల్ ప్రతిష్ట పూర్తిగా దిగజారుతోంది.

పట్టించుకోని అధికార యంత్రాంగం..

పన్నుల వసూళ్లు, నల్లా బిల్లుల వసూళ్లలో మున్సిపల్ అధికారులు బిజీగా మారి ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు కార్యాలయాలకే పరిమితమై సమస్యలను గాలికి వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎండిపోతున్న బోర్లు..

మేడ్చల్ మున్సిపాలిటీలో తాగునీటి కటకట మొదలైంది. ఓ వైపు పట్టణంలో చాలా కాలనీల్లో భూగర్భ జలాలు పూర్తిగా ఇంకిపోవడంతో బోర్లు ఎండిపోవడం ఓ సమస్యైతే.. మరోవైపు నిత్యం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లాల ద్వారా సరఫరా కావాల్సిన నీరు 2–3 రోజులకోసారి రాకపోవడంతో నల్లాలపై ఆధారపడిన కుటుంబాలు నీటికోసం తిప్పలు పడాల్సివస్తోంది. ఎమ్మెల్యే మల్లారెడ్డి నీటికోసం ధర్నా చేస్తామని చెబుతున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

పెరిగిన దోమల బెడద..

మున్సిపల్ అధికారులు విధిగా దోమల నివారణకు ఫాగింగ్ చేయకపోవడంతో దోమల సమస్య విపరీతంగా పెరిగింది. కాలనీలు వ్యర్థాల మయంగా మారడంతో దోమల సమస్య అధికమైంది.

డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరించండి



మంత్రి పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మచ్చబొల్లారం శ్మశానవాటికలో అక్రమంగా ఏర్పాటైన డంపింగ్‌యార్డును తొలగించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మచ్చబొల్లారం ప్రజల పాలిట డంపింగ్‌యార్డు గుదిబండలా మారిందన్నారు. డంపింగ్ యార్డు ద్వారా వస్తున్న కాలుష్యం నుంచి ప్రజలు, పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. డంపింగ్‌యార్డును తొలగించాలని స్థానిక కాలనీవాసులు జేఏసీగా ఏర్పడి పోరాటం చేస్తున్నారని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. లేదంటే తానే స్వయంగా ప్రజలతో కలిసి డంపింగ్ యార్డులో కూర్చొని ధర్నా చేస్తానన్నారు.

మల్లాపూర్‌లో ఈస్ట్ జోనల్ కమిషనర్ పర్యటన



మల్లాపూర్‌లో పర్యటిస్తున్న జెడ్సీ, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: డివిజన్‌లో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ పర్యటించారు. మంగళవారం రూ.48 లక్షలతో ఎఫ్‌సీఐ రోడ్, గుల్మోర్ గార్డెన్, జీ బ్లాక్ రోడ్‌లో స్టార్మ్ వాటర్‌డ్రైన్, రిస్టోరేషన్ పనులు, ఓల్డ్ మల్లాపూర్‌లో రూ.50 లక్షలతో చేపట్టబోయే ప్రతిపాదిత సీసీరోడ్డు పనులను పరిశీలించారు. కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, ఈఈ నాగేందర్, డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ వాసుగౌడ్, ప్రవీణ్, ఎండీ.ఉస్మాన్, కుమార్‌యాదవ్, ఫాతిమా, దుర్గాప్రసద్, శ్రీను, రఘు పాల్గొన్నారు.

అకారణంగా యువకుడిపై దాడి

మల్కాజిగిరి: అకారణంగా ఓ యువకుడి ఇంటికొచ్చి దాడికి పాల్పడిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏకలవ్యనగర్‌కు చెందిన వేణుగోపాల్ కుమారుడు కోనేరు దినేష్ ఈనెల 17న రాత్రి తన స్నేహితుడితో కలిసి కారులో గౌతంనగర్‌లో ఉంటున్న మరో స్నేహితుడు దినేష్ ఇంటికి వెళ్తుండగా.. ఆటో డ్రైవర్ మూలమలుపు వద్ద వారి కారుని ఢీ కొట్టాడు. కొద్దిసేపటి తర్వాత దినేష్ ఇంటికొచ్చిన కొంతమంది అతడిని దూషించి దాడిచేసి గాయపరిచారు. చికిత్స నిమిత్తం అతడిని మల్కాజిగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి తండ్రి వేణుగోపాల్ దాడికి పాల్పడిన రాకేష్, మోను, నిఖిల్‌తో పాటు పలువురిపై ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి పైపులైన్ వేయాలి



జలమండలి అధికారులకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ ధర్మారెడ్డి కాలనీలో తాగునీటి కోసం 300 ఎంఎం డయాలైన్ వేయాలని కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ మంగళవారం జలమండలి జీఎం సునీల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. మేనేజర్ సుజయ్, రమేష్, సురేందర్‌రెడ్డి తదితరులున్నారు.

'సృజన టెక్ ఫెస్ట్' లో ఆకట్టుకున్న ఆవిష్కరణలు



రామంతాపూర్: జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల నూతన ఆవిష్కరణల 'సృజన టెక్ ఫెస్ట్'ను రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్య జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిప్లొమా ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థులు తమలోని సృజనాత్మకతను మరింత మెరుగుపరుచుకుని పరిశ్రమలు, సమాజానికి ఉపయోగపడేలా నూతన ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. ఈ ప్రదర్శనకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలోని మెకానికల్ ఇంజినీరింగ్, అనుబంధ విభాగాల నుంచి 11 నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. సోలార్ పవర్‌ప్రాజెక్టు, అగ్రిటెక్ సోలార్ ప్రాజెక్టు, ఫైర్ ఫైటర్ ఆవిష్కరణలు పలువురిని ఆకట్టుకున్నాయి. అగ్రిటెక్ సోలార్ ప్రాజెక్టుతో పొలాల్లో కలుపు తీయడం, విత్తనాలు వేయడం, నాట్లు వేయడం వంటి విధులు సూర్యరశ్మితోనే నిర్వహించేలా రూపొందించిన ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. మాసబ్‌ట్యాంక్ విద్యార్థులు రూపొందించిన సోలార్ పవర్ ప్రాజెక్టు ఆవిష్కరణకు ప్రథమ బహుమతి, గజ్వేల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రూపొందించిన 360 డిగ్రీ ఫైర్ ఫైటర్ ఆవిష్కరణకు ద్వితీయ బహుమతికి ఎంపికైంది. కో– ఆర్డినేటర్ వినోద్ కుమార్, అసిస్టెంట్ కో– ఆర్డినేటర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

మూగజీవాలను పరిరక్షించుకోవాలి

ఉప్పల్: పర్యావరణ పరిరక్షణలో మూగజీవాలు కూడా ఎంతో మేలు చేస్తాయని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని, చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఇంటిపై పక్షులకు ప్లేట్, గిన్నెలో నీరు పోసి పెట్టాలని కోరారు. మంగళవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వెటర్నరీ అధికారులు, స్థానికులతో కలిసి నీటి తొట్లను ఏర్పాటు చేసి నీరు పోశారు. బీఆర్ఎస్ సీనియర్ నేత బన్నాల ప్రవీణ్, స్థానిక కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం

రామంతాపూర్: గోకులంనగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రామంతాపూర్‌కు చెందిన నరసింహాగౌడ్, శోభారాణి కుమారులు శేఖర్‌గౌడ్, కిషోర్ మంగళవారం రూ. 1,50,000లను ఆలయ ప్రతినిధి మురళీధర్‌నాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అయ్యప్పస్వామి పునర్నిర్మాణంలో తాము కూడా పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. స్థానికులు రేవు నరసింహ, దయాకర్‌రెడ్డి, నగేష్‌గుప్తా, సంతోష్ గుప్తా, రామలింగేశ్వర్‌గౌడ్, యాదగిరి, కిట్టు తదితరులున్నారు.

లింగంపల్లి నుంచి ఉప్పల్‌కు ఏసీ ఎలక్ట్రికల్ బస్సులు

మియపూర్: మియాపూర్ –2 డిపో పరిధిలో లింగంపల్లి నుంచి ఉప్పల్‌కు మూడు ఏసీ ఎలక్ట్రికల్ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి సర్వీస్ నంబర్ 113కే ఎల్ బస్సులు లింగంపల్లి నుంచి ఉప్పల్‌కు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న తాగునీటీ సమస్యను పరిష్కరించాలని పట్టణ బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నాగిరెడ్డితో బీజేపీ నేతలు సమావేశమై పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను వివరించి పరిష్కారాలపై చర్చలు జరిపారు. మిషన్ భగీరథ ద్వారా నీటిసరఫరాకు ఇబ్బందిగా ఉండటంతో పాత పద్ధతిలో మేడ్చల్‌కు బర్మాజీగూడ వైపు ఉన్న బోర్లను పునరుద్ధరించి నీటి సరఫరా చేయాలని కోరారు. వేసవిలో ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణ బీజేపీ అధ్యక్షురాలు శైలజ, నాయకులు సుధాకర్‌రెడ్డి, వంశీవిజయ్ తదితరులున్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ చేతన

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ స్ట్రీట్ నెంబర్-1లో రూ.28 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీరోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. మంగళవారం కార్పొరేటర్ కక్కిరేణి చేతనాహరీష్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి రోడ్డు పనులను ప్రారంభించారు. డివిజన్ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు అన్ని విధాలుగా కృషి చేయనున్నట్లు ఈ సందర్భంగా కార్పొరేటర్ పేర్కొన్నారు. బీజేపీ నేతలు సంజయ్‌పటేల్, సుమన్‌రావు, రఘుపతిగౌడ్, ఎల్లాచారి, ప్రవీణ్, రవీందర్, సురేష్, కట్టా భాస్కర్, రమేష్‌నాయక్, శ్రీనివాస్, సుకన్య, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేద్దాం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రధానోపాధ్యాయులు దామోదర్

బోడుప్పల్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేద్దామని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. బోడుప్పల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాబోధన జరుగుతుందని, దీనికనుగుణంగా విద్యార్థులు కష్టపడి మంచి ఫలితాలు సాధించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. గాయకురాలు అనన్య భాస్కర్ పాటలు పాడి విద్యార్థులను ఉత్సాహపర్చారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు పెద్ది దామోదర్, సుజాత, సోహం రోబోటిక్ సీఈఓ సహదేవ్, ఏపీసీ చైర్మన్ స్వాతి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా గ్రీన్ డే

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో గ్రీన్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ గంగరాజు మాట్లాడుతూ.. ఆరోగ్యవంతంగా ఉండేందుకు ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు తీసుకోవాలన్నారు. బయటదొరికే చిరుతిండ్లు, కూల్‌డ్రింక్స్, ఫాస్ట్‌ఫుడ్ తదితర పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితం కోసం కృషి చేయాలని కోరారు. విద్యార్థులు ఆకుకూరలు, పండ్లు, కూరగాయల దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



డ్రగ్స్ నిర్మూలనపై ముగిసిన వర్క్‌షాప్



ఉప్పల్: నేషనల్ సోషల్ డిఫెన్స్ సహకారంతో నెహ్రూ యువ కేంద్రం రంగారెడ్డి జిల్లా యువజన, క్రీడామంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు డ్రగ్స్ నిర్మూలన వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. నిమ్స్ ఆస్పత్రి ప్రొఫెసర్లు, జిల్లా యువజన అధికారి ఇసయ్య, ఎస్సై కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొని మాట్లాడారు. జీవితంలో డ్రగ్స్, మద్యం, భారిన పడకుండా ఉండేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడి కార్యకర్తలు, ఎన్‌వైకే సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

అల్వాల్: తెలంగాణ రాష్ట్ర ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్ కొకూర్‌లోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించబడిన ఎఫ్ఎల్ఎన్ ఏఐ ఏఎక్స్‌ఎల్ కార్యక్రమ నిర్వహణను ఆయన పరిశీలించి రివ్యూ చేశారు. కంప్యూటర్ ల్యాబ్‌లోని సౌకర్యాలు, ఇంటర్నెట్ స్పీడ్ తదితర వివరాలను పరిశీలించారు. పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఎక్స్‌ఎల్ కార్యక్రమ నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రవీందర్‌రాజు, అల్వాల్ మండల విద్యాధికారి మురళీకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి



కాలనీవాసులతో డీసీని కలిసిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో అసంపూర్తి పనులను పూర్తిచేయాలని కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ శ్రవణ్ సర్కిల్ ఉప కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితమే సీసీరోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనా ఇప్పటి వరకు ప్రారంభించలేదన్నారు. ఆర్‌కేనగర్ సినీపోలీస్ వద్ద రూ.45 లక్షలతో చేపట్టాల్సిన నాలా పనులు కూడా ప్రారంభించాలని, నిధులు అవసరమైతే ఇంకా మంజూరు చేయిస్తామని డీసీకి తెలిపానన్నారు. డీఈ మహేష్, ఏఈ నవీన్, రమేష్, శ్రీదేవి, విమల, స్వరూప, సుగుణ, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల్లో ఎస్సీలకు ప్రయోజనం చేకూర్చాలి



కార్యక్రమంలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్, కలెక్టర్ గౌతమ్

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

సాక్షి,సిటీబ్యూరో: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని ఎస్సీ సామాజికవర్గానికి ప్రయోజనం చేకూరేలా అధికారులు అవగాహన కల్పించాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్ వీసీహాల్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీ, వడ్డీలేని రుణాల పథకాలు ఎస్సీవర్గాలకు అందేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలశాఖ ద్వారా స్వయం ఉపాధికి సంబంధించిన చిన్న కుటీర పరిశ్రమలు నెలకొల్పేందుకు ఔత్సాహిక యువతను ప్రోత్సహించాలని ఆయన పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన సరుకులు, భోజనంపై సభ్యులను ఆయన అడిగి తెలుసుకున్నారు. స్కాలర్‌షిప్స్ తదితర విషయాలపై చర్చించి అడ్మిషన్‌లకు ఇబ్బంది కలగకుండా చూడాలని, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్‌కు సూచించారు. అట్రాసిటి కేసుల్లో జాప్యం కలగకుండా సంబంధిత తహసీల్దార్ ధ్రువీకరణపత్రాలను త్వరితగతిన అందించాలని సూచించారు.

◆ ఎస్సీలకు అందించే వివరాల శాతాల జాబితాను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్‌గౌతమ్ ఆయనకు వివరించారు. పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, జాతీయ కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్‌లను సత్కరించారు. డీసీపీలు పద్మజ, కోటిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారి వినోద్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు ఝాన్సీరాణి, డాక్టర్ ఉమాగౌరీ, జ్యోతి, చంద్రకళ, రాధిక, శేఖర్, సాంబశివరావు, సుగుణాబాయి, ఆర్డీఓలు శ్యామ్‌ప్రకాష్, ఉపేందర్‌రెడ్డి, ఏసీపీలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.